సివిల్స్ అభ్యర్థులకు అన్ని రకాల ప్రోత్సాహం

- సిఎం రేవంత్ రెడ్డి

అభ్యర్థికి చెక్కు అందజేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రం నుంచి సివిల్స్‌కు సిద్ధపడుతున్న అభ్యర్థులను ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మెయిన్స్‌కు ఎంపికైన 20 మంది అభ్యర్థులకు రూ.ఒక లక్ష చొప్పున చెక్కులను సిఎం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్స్‌కు ప్రస్తుతం బీహార్ నుంచి ఎక్కువ మంది ఎంపికవుతున్నారని చెప్పారు. మన రాష్ట్రం నుంచి ఎక్కువ మంది ఎంపికయ్యారని చెప్పుకునే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అందుకే వారికి రూ.ఒక లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నామనీ, దీన్ని సాయంగా కాకుండా ప్రోత్సాహంగా భావించాలని కోరారు. సివిల్స్‌లో మన రాష్ట్ర అభ్యర్థులు ఎక్కువ మంది రాణించాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఇంటర్వ్యూకు వెళ్లే ప్రతి ఒక్కరూ ఎంపిక కావాలని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. కష్టంతో పాటు అంకితభావం ఉంటే విజయం వరిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ ఏడాది మార్చి 31లోగా 563 గ్రూప్ 1 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత పదేళ్ల ఉద్యోగాల భర్తీలేక నిరుద్యోగులు నష్టపోతే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దేశానికే తెలంగాణ ఆదర్శ రాష్ట్రంగా నిలిచేలా మొదటి ఏడాదిలోనే 55,143 ఉద్యోగ నియామకాలు చేపట్టినట్టు ఆయన గుర్తుచేశారు. 14 ఏళ్లుగా గ్రూప్ 1 పరీక్ష నిర్వహించకుంటే, అన్ని అడ్డంకులను, కుట్రలను అధిగమించి పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేసేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు.

డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ సివిల్ ఇంటర్వ్యూకు ఎంపికైన 20 మంది అభ్యర్థులు తుది పరీక్షల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇంటర్వ్యూ సమయంలో ఢిల్లీలో వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. యువతను సివిల్స్ వైపు మళ్లించేందుకే దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సింగరేణి పక్షాన ప్రత్యేక కార్యక్రమం తీసుకున్నట్టు తెలిపారు. అందివచ్చిన అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సింగరేణిని దేశవ్యాప్తంగా విస్తరిస్తామని భట్టి తెలిపారు. సింగరేణి ప్రాంతంలో గనులు తవ్వి వదిలివేసిన ప్రాంతాలు, ఖాళీగా ఉన్న స్థలాల్లో సోలార్, పంప్‌డ్ స్టోరేజ్ వంటి పద్ధతుల్లో గ్రీన్ పవర్ ఉత్పత్తి చేస్తామన్నారు. ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ పవర్ వైపు మళ్లుతూ బొగ్గుపై ఆధారపడే పరిస్థితి తగ్గుతున్న నేపథ్యంలో గనులు మూతపడే అవకాశముందని భట్టి తెలిపారు. ఈ నేపథ్యంలో ముందుచూపుతో సింగరేణిని మైనింగ్ రంగంలో దేశంలో విస్తరించే ఆలోచనలో ప్రభుత్వముందని వెల్లడించారు. దేశవ్యాప్తంగా నిపుణులను ఆహ్వానించి సలహాలు, సూచనలు స్వీకరించనున్నట్టు చెప్పారు. లిథియం, గ్రానైట్ తదితర గనుల తవ్వకాల వైపు సింగరేణిని తీర్చిదిద్దబొతున్నట్టు వివరించారు. గత పాలకులు వారి వ్యక్తిగత, రాజకీయ అవసరాలకు వాడుకుంటే తాము సింగరేణిని ప్రసిద్ధ సంస్థగా నిలబెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

కార్మికుల పిల్లల విద్య కోసం రూ.200 కోట్లకు తగ్గకుండా ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.ఒక కోటి రూపాయలకు పైగా ఉచిత ప్రమాద బీమా అందిస్తున్నామని చెప్పారు. సింగరేణిని కార్మికులు తమ సంస్థ అనుకుంటే మంచి ఫలితాలు సాధిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సింగరేణి సీఎండీ బలరాం, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్ తదితరులు

పారిశ్రామికవేత్త మన్నె సుబ్రమణ్యంకు సిఎం నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవల మరణించిన ప్రముఖ పారిశ్రామికవేత్త, టిడిపి నాయకులు మన్నె సుబ్రమణ్యంకు సిఎం రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. ఆదివారం హైదరాబాద్ చక్రిపురం కాలనీలోని శ్రీకృష్ణ కన్వెన్షన్‌లో కుటుంబ సభ్యులు నిర్వహించిన మన్నె సుబ్రమణ్యం పెద్దకర్మలో సిఎం పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మన్నె సుబ్రమణ్యం చిత్రపటానికి నివాళులర్పించి ఆయనతో వారికి ఉన్న గుర్తు చేసుకున్నారు. సుబ్రమణ్యం చేసిన సేవా కార్యక్రమాలు, ఆయన జ్ఞాపకాలను భారీ స్క్రీన్‌లపై ప్రదర్శించారు. టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, కాప్రా ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఉల్లోజు శ్రీనివాస్, వేముల శంకర్, కార్యనిర్వాహక అధ్యక్షులు విజయ ముదిరాజ్, పలువురు పాత్రికేయులు మన్నె సుబ్రమణ్యం పెద్దకర్మలో పాల్గొని సంతాపం తెలియజేశారు. ఈసందర్భంగా పీఏసీ చైర్మెన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రులు మండవ వెంకటేశ్వరరావు, సముద్రాల వేణుగోపాల చారి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, టిటిడి పాలకమండలి సభ్యులు నన్నూరి నర్సిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉప్పల్, మేడ్చల్ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు మందముల పరమేశ్వర్‌రెడ్డి, వజ్రేష్ యాదవ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్లు శిరీష సోమశేఖర్‌రెడ్డి, బొంతు శ్రీదేవి, పన్నాల దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పజ్జూరి పావని మణిపాల్‌రెడ్డి, టిడిపి నాయకులు టిజికె మూర్తి, రాములు యాదవ్, రాంబాబు, నీరుకొండ సతీష్ బాబు నివాళులు అర్పించారు.

రైతు భరోసా రూ.15 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు చెల్లిస్తామంటూ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఎన్నికల్లో చెప్పిన మాట ప్రకారం కాకుండా ఎకరాకు రూ.12 వేలే చెల్లిస్తామనడం అన్యాయమని తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సదర్శన్‌రావు, టి సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా వానాకాలం సీజన్‌కు భరోసా ఇవ్వకపోవడం అన్యాయమని తెలిపారు. అసలు వానాకాలానికి ఇస్తారో, లేదో స్పష్టత ఇవ్వాలని కోరారు. ఎన్నికల్లో ప్రకటించిన హామీ రూ.15 వేలు అని చెప్పి...రూ.12 వేలు ప్రకటించడం అన్యాయమని తెలిపారు. వానాకాలానికి రైతు భరోసా వారి ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన ఆలోచన మార్చుకోకపోతే, జరగనున్న పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు.

11 నుంచి స్కూళ్లు, కాలేజీలకు సంక్రాంతి సెలవులు

హైదరాబాద్ బ్యూరో : రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కాలేజీలకు ఈనెల 11 నుంచి సంక్రాంతి పండుగ సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. అకడమిక్ కేలెండర్‌లో ఈనెల 13 నుంచి 17 వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. అయితే ఈ నెల 11న రెండో శనివారం, 12న ఆదివారం కావడంతో అదనంగా రెండు రోజులు సెలవులొచ్చాయి. దీంతో ఈ నెల 11 నుంచి 17 వరకు ఏడురోజులపాటు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ నెల 11 నుంచి 16 వరకు ఆరురోజులపాటు జూనియర్ కాలేజీలకు సంక్రాంతి సెలవులుంటాయి. ఈ నెల 18న పాఠశాలలు, 17న జూనియర్ కాలేజీల్లో తిరిగి తరగతులు ప్రారంభమవుతాయి.

కుల, మతాలకతీతమైన సమాజం కోసం కృషి

- సావిత్రిబాయి పూలే జయంతిలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుల, మతాలకతీతమైన సమాజం కోసం సావిత్రి భాయి పూలే కలగన్నారని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు టి జ్యోతి అన్నారు. శనివారం హైదరాబాద్‌లో వీరనారి ఐలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'బాలికల విద్యా -సావిత్రిభాయి పూలే కషి' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో జ్యోతి మాట్లాడుతూ దేశంలో మొదటి బాలికల పాఠశాల ఏర్పాటు చేసిన మహిళ పూలేనని చెప్పారు. కుల మత బేధాలకు అతీతంగా సమాజాన్ని ప్రమించిన ప్రేమ స్వరూపిణి సావిత్రిభాయి అని తెలిపారు. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని ఆమె నమ్మారన్నారు. పూణెలో మొట్టమొదటిగా బాలికల పాఠశాలను ప్రారంభించారని గుర్తు చేశారు. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక భాధ్యతగా విశ్వసించారన్నారు. ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిభాయి పూలే అన్నారు. ట్రస్టు చైర్మన్ బుగ్గవీటి సరళ మాట్లాడుతూ పాచిత్రిబాయి పూలే బాలికలకు విద్యను అందించారని తెలిపారు.

పోరాటాలతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం

- సిపిఎం రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం చైర్మన్ చుక్క రాములు
- మహాసభను పురస్కరించుకొని పటాన్‌చెరులో 2కే రన్

2కే రన్‌ను ప్రారంభిస్తున్న చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మిక, కర్షక, ప్రజాసమస్యలు.. ఉద్యమాలు, పోరాటాలతోనే పరిష్కారం అవుతాయని సిపిఎం రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం చైర్మన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. మహాసభను పురస్కరించుకొని ఆదివారం ఉదయం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలో నిర్వహించిన 2కే రన్‌లో మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ జె మల్లికార్జున్‌తో కలిసి చుక్క రాములు పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రన్ ప్రారంభించారు. రామచంద్రపురంలోని అంబేద్కర్ విగ్రహం వరకు ఈ రన్ కొనసాగింది. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె రాజయ్య అధ్యక్షతన జరిగిన సభలో చుక్క రాములు మాట్లాడారు. కార్మికవర్గ సమస్యలు పోరాటాలతోనే పరిష్కారమవుతాయే తప్పా పాలకుల దయాదాక్షిణ్యాలపైన కాదని ఇప్పటికే అనుభవంలో రుజువైందన్నారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనను తిరస్కరించి.. కష్టాలు తీరుస్తారని కాంగ్రెస్‌కు పట్టం కడితే ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా సమస్యలు ఉన్నాయని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సిపిఎం నాయకత్వం సిఎంను కలిస్తే.. వెంటనే పరిష్కరిస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఏడాది దాటిపోతున్నా పరిష్కరించలేదని విమర్శించారు. ఒక్క రూపాయి కూడా పెంచకుండా పాత బేసిక్‌లోకే పాత డీఏను కలిపి కొత్త బేసిక్‌ను తయారు చేశారని, ఒకరకంగా ఇది కార్మికుల శ్రమను అపహాస్యం చేయడమేనని అన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏకంగా కార్మిక వర్గం పైనే దాడి చేస్తోందన్నారు. 49 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని, వాటికి గెజిట్ చేసే విధంగా ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ఇదే జరిగితే కార్మిక హక్కులు పోయి, సంఘం పెట్టుకునే హక్కు కూడా ఉండబోదన్నారు. ఇప్పటికే పర్మినెంట్ ఉద్యోగాలు పోయాయని, కొంతకాలం కాంట్రాక్ట్ వ్యవస్థను నడిపారని, ఇప్పుడు అప్రెంటిస్ విధానం తీసుకొస్తున్నారని, దీనికి స్కిల్ డెవలప్‌మెంట్ పేరు పెడుతున్నారని తెలిపారు. కార్మిక వర్గ శ్రమను కారు చౌకగా కొల్లగొట్టమని అదానీ, అంబానీలకు మోడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆరోపించారు. కార్మిక వర్గ ప్రయోజనాలే తమ ప్రయోజనాలుగా వారి సమస్యల పరిష్కారం కోసం సిపిఎం నిరంతరం పోరాడుతున్నదన్నారు. శ్రామికుడే పాలకుడు కావాలని, శ్రామికుల రాజ్యం రావాలని.. ఇది ఎర్రజెండాతోనే సాధ్యమవుతుందని స్పష్టంచేశారు. ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభలో తెలంగాణ సమగ్ర అభివృద్ధి, కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వాజిద్ అలీ, పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, ఎం శ్రీనివాస్, బంగారు రాజు, వెంకటేశ్వరరావు, సదాశివరెడ్డి, శ్రీనివాస్, నాగప్రసాద్, రాములు, రాజు, మణిరాజ్, రామ్ రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్, చక్రధర్ సింగ్, రామకష్ణ, నర్సింలు, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలి

- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం విశ్వనాథపురం గ్రామంలో రూ. 8.40 కోట్లతో నిర్మించే మూడు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం భట్టి మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో కరెంటు సమస్యలు తలెత్తకుండా మూడు సబ్ స్టేషన్ల ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, ఇంటికో ఉద్యోగం, దళిత, గిరిజనులకు మూడెకరాల భూమి ఇస్తామని బిఆర్ఎస్ మోసపూరితమైన మాటలు చెప్పి అవినీతి అక్రమాలతో కడుపు నింపుకున్నారని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరం లోపునే ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల్లో.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ పథకం అమలు చేసినట్టు తెలిపారు. రూ.రెండు లక్షలలోపు రుణం ఉన్న రైతులకు రుణమాఫీ చేసామని, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను ఇస్తామని చెప్పారు. వ్యవసాయానికి యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసాను జనవరి 26న పంపిణీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రు నాయక్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ ఎంపి కడియం కావ్య, భూపాలపల్లి, పరకాల ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యుఎంసి కమిషనర్ అశ్విని తానాజీ వాఖేడే, ఎన్‌పిడిసిఎల్ చైర్మన్ వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- విధుల విషయంలో కఠినంగా ఉంటా
- డిపిఓలకు మంత్రి సీతక్క దిశానిర్దేశం

సీతక్కను సత్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంచాయతీరాజ్‌శాఖకు వన్నె తీసుకొచ్చేలా పనిచేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) ఆదేశించారు. వ్యక్తిగా తాను ఎంత సున్నితమో..విధుల పట్ల అంతే కఠినంగా ఉంటానని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యల పట్ల సున్నితంగా వ్యవహరించినా..విధుల పట్ల అలసత్వం ప్రదర్శించినా సహించేది లేదని హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో గల గ్రామీణ తాగునీటి సరఫరా కేంద్ర కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారుల (డిపిఓ)తో ఆమె సమీక్ష నిర్వహించారు. మూడున్నర గంటల పాటు సాగిన సమావేశంలో అన్నిజిల్లాల డీపీఓల అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామాల్లో నిధుల వినియోగం, పారిశుధ్య నిర్వహణ, తాగు నీటి సరఫరా, పనుల పురోగతి, పచ్చదనం, ఆయా జిల్లాల్లో నెలకొన్ని పరిస్థితులపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..పంచాయతీ రాజ్ వ్యవస్థలో మెరుగైన ఫలితాలు సాధించే విధంగా దిశా నిర్దేశం చేశారు. పల్లెలను ప్రగతి పథంలో నిలిపేలా డిపిఓలు పనిచేయాలని కోరారు. గ్రామీణ ప్రజలకు గౌరవప్రదమైన జీవనం, గ్రామాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అంగన్ వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలకు సురక్షిత తాగు నీరు సరఫరా అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కాలనీలు, ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా అవుతున్న తాగు నీటి విషయంలో ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు తెరిచేలోపు తాగు నీటి సరఫరాపూర్తవుతున్నందున..తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు హెడ్ మాస్టర్, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో వ్యవహరించి ఉదయమే ట్యాంకులు నింపుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మానవత్వాన్ని జోడించి పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీనిచ్చారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల ఫైల్‌ను క్లియర్ చేయించిన విధంగానే డిపిఓల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఇక నుంచి ప్రతి నెలా డిపిఓలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. తమ కింది స్థాయి ఉద్యోగులతో 15 రోజులకు ఒకసారి సమీక్షలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖను సొంత కుటుంబంగా భావించి అధికారులు పనిచేయాలని సూచించారు. ఫీల్డ్ విజిట్స్ పెంచాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛదనం పచ్చదనం, పనుల జాతరను విజయవంతం చేసినందుకు..సీఎం రేవంత రెడ్డి అభినందించిన విషయాన్ని గుర్తుచేసారు. వచ్చే వేసవి కాలంలో తాగు నీటి సమస్యలు లేకుండా యాక్షన్ ప్లాన్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామీణ తాగునీటి సరఫరా అధికారులతో సమన్వయం చేసుకొని పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో సఫాయి కార్మికులు, మల్టీపర్పస్ వర్కర్ల దే కీలక పాత్ర అనీ, వారికి ప్రతి నెల ఐదో తారీఖు లోపు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో మాదిరిగా గ్రామ పంచాయతీల ద్వారా కాకుండా నేరుగా పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుంచే ఏకకాలంలో జీతాలు చెల్లించే విధానాన్ని అవలంబిస్తున్నామన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ మాట్లాడుతూ..గ్రామాల్లో స్వచ్ఛదనం, పచ్చదనం పెంపొందించాలనీ, గ్రామాల్లో రోడ్ల వెంట మురుగు నీరు పారితే సంబంధిత పంచాయతీ కార్యదర్శులను బాధ్యులుగా చేస్తామని అన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ పక్కాగా జరగాలనీ, తడిచెత్త పొడి చెత్తను వేరు చేసే విధానాన్ని అవలంభించాలని కోరారు. స్థానిక ఎన్నికల షెడ్యూల్ త్వరలో వచ్చే అవకాశం ఉన్నందున..అధికారులంతా సిద్ధంగా ఉండాలని సూచించారు. కమిషనర్ శ్రీజన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు మొదలుకుని డిపిఓల వరకు అంతా సమయ పాలన పాటించి.. పనితీరును మెరుగు పరుచుకోవాలని సూచించారు. గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేలా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు.

జనం గొంతుకగా నిలవండి

- మీకు అండగా మేముంటాం
- డిజిటల్ మీడియా జర్నలిస్టులతో నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామాన్య ప్రజల గొంతుకగా డిజిటల్ మీడియా నిలవాలని పలువురు నాయకులు ఆకాంక్షించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ప్రజా ప్రభుత్వం - ప్రజాస్వామ్యం -డిజిటల్ మీడియా పాత్ర, హక్కుల సాధనకై ఏం చేద్దాం? అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర సమాచార కమిషన్ మాజీ చైర్మన్ మాడభూషి శ్రీధర్, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్‌లతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు హన్మేష్, ఐఎఫ్‌టియు నాయకులు సునీత తదితరులు పాల్గొని మాట్లాడారు. నోరు లేని అణగారిన వర్గాల సమస్యలను వెలుగులోకి తెస్తున్న డిజిటల్ మీడియా జర్నలిస్టులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు.

పాశం యాదగిరి మాట్లాడుతూ లగచర్లలో రైతుల ఆందోళన, నిర్మల్ ఇథనాల్ ఫ్యాక్టరీపై ప్రజల వ్యతిరేకత తదితర ఘటనలను డిజిటల్ మీడియానే మొదట వెలుగులోకి తెచ్చిందని కొనియాడారు. దేశం నాశనమైపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక డైరెక్షన్, శిక్షణతో డిజిటల్ మీడియా ప్రభావవంతమైన వార్తలతో, పామరుల భాషతో సామాన్యుల చుట్టూ తిరగాలని ఆకాంక్షించారు. అందరం కలిసి సహకార ఉద్యమంలా ముందుకెళ్దామని సూచించారు.

మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ డిజిటల్ మీడియా ప్రాధాన్యత కలిగిన మీడియా అని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రధాన మీడియా సహకరించకున్నా డిజిటల్ మీడియానే జనం గొంతుకు వేదికగా మొదట నిలిచిందని ఉదహరించారు. సోషల్ మీడియా అంటే సివిల్ మీడియా (పౌరశక్తి) అని అభివర్ణించారు. డిజిటల్ మీడియా కట్టడికి ప్రభుత్వాలు చట్టాలను దుర్వినియోగం చేయకుండా అప్రమత్తంగా ఉండి ఎదుర్కోవాలని సూచించారు.

గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ మీడియాలో పెట్టుబడి పెట్టిన ఒక సామాజిక వర్గం దాని ప్రయోజనాలను పొందిందని తెలిపారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ కావడానికి సోషల్ మీడియా సహకారమే కారణమని చెప్పారు. సమాచార హక్కు చట్టం కార్యకర్తలతో కలిసి పని చేయాలని సూచించారు. ధరణి పేరుతో రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందనీ, జీహెచ్‌ఎంసీ పరిధిలో 25 వేల ఎకరాల దళితులు, పేదల భూములను తీసుకున్నారని ఆరోపించారు. హైదరాబాద్ హవాలా పేరుతో రూ.లక్షల కోట్ల అవినీతి జరుగుతుందన్నారు. ఇలాంటి వాటిని వెలుగులోకి తేవాలని సూచించారు. అదే సమయంలో పాలకవర్గాల నుంచి వచ్చే వ్యతిరేకత, ఒత్తిడిని తట్టుకునేలా డిజిటల్ మీడియాకు చట్టపరంగా అండగా నిలిచే సైన్యం అవసరమని తెలిపారు.

ఃడిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ (డిఎంజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు అశోక్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ అధికారంలోకి వచ్చాక దేశంలో 30 మంది డిజిటల్ జర్నలిస్టులు హత్యకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటల్ మీడియాకు చట్టబద్ధత కల్పించాలని, ఈ మీడియా నుంచి రిపోర్టింగ్ చేస్తున్న వారిని జర్నలిస్టులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ డిజిటల్ మీడియాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

అయ్యప్ప సొసైటీలో హైడ్రా కూల్చివేతలు

- ఐదు అంతస్తుల భవనం నేలమట్టం
- నోటీసులు ఇచ్చినా పట్టించుకోక పోవడం తీవ్రంగా పరిగణించిన హైడ్రా కమిషనర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో వెలిసిన అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుల్లించింది. అక్రమంగా రోడ్డుకు అడ్డంగా నిర్మించిన ఐదు అంతస్తుల భవనాన్ని ఆదివారం కూల్చివేసింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని సర్వేనెంబర్ 11/15 అయ్యప్ప సొసైటీలో 684 గజాల్లో అక్రమంగా నిర్మించిన భవనానికి గతంలో జిహెచ్‌ఎంసి నోటీసులు ఇచ్చింది. అలాగే నిర్మాణం ఆపాలని, భవనం కూల్చివేయాలని హైకోర్టు కూడా స్టే ఇచ్చింది. అయితే ఆ ఉత్తర్వులను పట్టించుకోకుండా.. సెల్లార్, గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు 5 అంతస్తుల భవనాన్ని నిర్మించారు. ఇది అక్రమ నిర్మాణం కావడం, దీనికి తోడు 100 ఫీట్ రోడ్డు ఒకవైపు అండర్ పాస్ బ్రిడ్జి సైతం బిల్డింగ్‌కి సమీపంలో ఉండటం, స్థలంపై అనేక కేసులు ఉండటం, ఎలాంటి నిబంధనలు పాటించపోవడంపై జిహెచ్‌ఎంసి అధికారులు పలుమార్లు బిల్డర్లకు నోటీసులు జారీచేశారు. అయినా వారు వాటిని పట్టించుకోకుండా నిర్మాణాన్ని చేపట్టడంతో దీనిపై ఇటీవల స్థానికులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. తమకు వచ్చిన ఫిర్యాదుల మేరకు హైడ్రా, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం భవనాన్ని పరిశీలించారు. అక్రమ కట్టడమని హైకోర్టు నిర్ధారించాక కూడా కోర్టు ఉత్తర్వులు, జిహెచ్‌ఎంసి నోటీసులు పట్టించుకోకుండా భవనాన్ని నిర్మించడాన్ని కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. శనివారమే సదరు భవనం కూల్చివేత పనులు చేపట్టాల్సి ఉన్నా ట్రాఫిక్ సమస్యల కారణంగా ఆదివారం ఉదయానికి వాయిదా వేశారు. ఆదివారం జెసిబిల సాయంతో భవనాన్ని పూర్తిగా కూల్చివేశారు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా ప్రధాన రహదారికి ఆనుకొని ఐదంతస్తుల నిర్మాణం చేపడుతున్నప్పటికీ జిహెచ్‌ఎంసి, ఇతర శాఖల ఉన్నత అధికారులు బిల్డింగ్‌ని చూసి చూడకుండా వదిలేయడం అనుమానాలకు తావిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం వల్లే భవన నిర్మాణం జరిగిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకటన
మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి, జూనియర్ డివిజన్ వారి కోర్టులో
O.S.No.623/2019
వాదులు : కొత్తపల్లి రామకృష్ణ (Died) వగైరా
ప్రతివాదులు : వైట్ల శ్రీనివాసరావు వగైరా
To.
Godavarti Radha Devi, W/o.Prasad,
Villa No.1025, ARINSS REMINUS,
Financial District, Nanakramguda,
Hyderabad, Telangana-500008.
ఇందుమూలముగా 3వ ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు గ్రంథములో మహారాజశ్రీ కోర్టు వారి ద్వారా సమను పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మహారాజశ్రీ కోర్టు వారు 3వ ప్రతివాదికి సమనులు అమలు నిమిత్తం పేపరు ప్రకటన ఆర్డరు వేసియున్నారు. కావున ఈ పేపరు ప్రకటన తేదీ నుండి 30 రోజులలోగా పైన తెలిపిన కోర్టు వారి యెదుట స్వయముగా గానీ, అడ్వకేటు వారి ద్వారా గానీ హాజరై తమ అభ్యంతరములు తెలియజేసుకొనవలెను. లేని యెడల పై నెంబరు దావా మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.
(శ్రీకోర్టు ఉత్తర్వుల మేరకు)
K.V.N.Kama Sastri,
K.Ravindra, Advocates,
26-4-2, N.S.C.Bose Raod,
Dt.05-01-2025 Tanuku-534211.

సంక్షోభంలో పెట్టుబడిదారీ విధానం

- సోషలిజం అజేయం
- రాష్ట్రాల హక్కులను హరించేందుకే జమిలి ఎన్నికలు
- మతతత్వ వ్యతిరేక పోరాటాలను చేపడతాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలో ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో నవతెలంగాణ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇటీవల అనారోగ్యంతో మరణించిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి తమ్మినేని సహా ఇతర నాయకులు, సిబ్బంది పూలమాలవేసి నివాళులర్పించారు. నవతెలంగాణ జనరల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ సోవియట్ యూనియన్ దెబ్బతిన్న తర్వాత సోషలిజానికి భవిష్యత్తు ఉందా? అనే చర్చ జరిగిందన్నారు. కానీ సోషలిజం అజేయమని ఉద్ఘాటించారు. పెట్టుబడిదారీ దేశాలు, అమెరికా సామ్రాజ్యవాదం సంక్షోభంలో ఉన్నాయని అన్నారు. ధరల పెరుగుదల, ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని వివరించారు. చైనా ఉత్పత్తి లేకుండా అమెరికా సహా ప్రపంచదేశాలు ముందుకు సాగలేని పరిస్థితి ఉందన్నారు. సోషలిస్టు పంథాను అనుసరించడం వల్లే చైనాకు ఇది సాధ్యమైందని చెప్పారు.

సీట్లు తగ్గినా విధానాల అమల్లో బిజెపి దూకుడు

పార్లమెంటు ఎన్నికల్లో 302 నుంచి 240 సీట్లకు బిజెపి పడిపోయిందని తమ్మినేని వివరించారు. చంద్రబాబు, నితీశ్ మద్దతు లేకుంటే బిజెపి అధికారం నుంచి దూరమయ్యేదని అన్నారు. సీట్లు తగ్గినా మతోన్మాదం, నియంతృత్వ, ఆర్థిక విధానాలను అంతే దూకుడుగా అమలు చేస్తున్నదని విమర్శించారు. జమిలి ఎన్నికల బిల్లు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి వెళ్లిందన్నారు. దాని అమలు కోసం బిజెపి శతవిధాలుగా ప్రయత్నం చేస్తుందని చెప్పారు. జమిలి ఎన్నికలు వస్తే దేశం తీవ్రంగా నష్టపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఖర్చు తగ్గుతుందనీ, ఎన్నికల కోడ్ వల్ల అభివృద్ధి పనులు ఆగిపోతాయనీ, సమయం మిగులుతుందనేది సాకు మాత్రమేనని అన్నారు. జమిలి ఎన్నికలు వస్తే ఏక పార్టీ, ఏక వ్యక్తి నియంతృత్వం పెరుగుతుందన్నారు. దేశంలో ఫెడరల్ వ్యవస్థ దెబ్బతింటుందని విమర్శించారు. ఎన్నికలు జరిగేప్పుడు అభివృద్ధి పనులు ఆగకుండా నిబంధనలను మారిస్తే సరిపోతుందని చెప్పారు. రాష్ట్రాల అధికారాలను హరించడం కోసమే జమిలి ఎన్నికలను జరపాలని బిజెపి చూస్తున్నదని విమర్శించారు. గవర్నర్ల ద్వారా బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపర్చాలని చూస్తోందన్నారు. బిజెపి దాని అనుకూల ప్రభుత్వాలకు ఎక్కువ నిధులు, బిజెపియేతర ప్రభుత్వాలకు తక్కువ నిధులను ఇస్తున్నదని చెప్పారు. రాజ్యాంగ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని అన్నారు. లౌకికవాదాన్ని దెబ్బకొడుతున్నదని విమర్శించారు. మతతత్వాన్ని పెంచిపోషిస్తున్నదని చెప్పారు. బిజెపి పాలన ఇలాగే కొనసాగితే దేశం విచ్ఛిన్నం అవుతుందన్నారు. మతతత్వ వ్యతిరేక పోరాటం చేయాలనీ, అందుకోసం ప్రజలను చైతన్యం చేయాలని అన్నారు. ఆర్థిక విధానాల్లో బిజెపి, కాంగ్రెస్ ఒక్కటేనని చెప్పారు. మతోన్మాదం విషయంలోనే ఆ రెండు పార్టీలకూ తేడా ఉందన్నారు. అందుకే సిపిఎం పోటీ చేయని చోట కాంగ్రెస్‌కు మద్దతిచ్చామని గుర్తు చేశారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న తమ్మినేని

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప కాంగ్రెస్ ఇచ్చిన హామీలేవీ అమలు కాలేదని తమ్మినేని విమర్శించారు. రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేసినా పూర్తిస్థాయిలో జరగలేదన్నారు. రైతుభరోసా, వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు, నిరుద్యోగ భృతి వంటివి అమలు కాలేదని వివరించారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలివ్వలేదని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి డిక్లరేషన్లు అమలు కాలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని విమర్శించారు. మూసీ ప్రక్షాళన, సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదన్నారు. నాలాలు, చెరువులు, కుంటలను పరిరక్షించడం మంచిదేనని చెప్పారు. కానీ డబ్బులు పెట్టి కొనుక్కున్న ఇండ్లను హైడ్రా పేరుతో కూల్చివేయడం సరైంది కాదన్నారు. దీంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం పడిపోయిందన్న అభిప్రాయం వస్తోందని చెప్పారు. ఫార్మాసంస్థల విషాన్ని మూసీలోకి వదలకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం వద్ద ఫార్మాసిటీ కోసం సేకరించిన 13 వేల ఎకరాల భూమిని తిరిగి రైతులకు ఇస్తామంటూ రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారనని గుర్తు చేశారు. ఫార్మాసిటీని రద్దు చేశారు కానీ ఆ భూములను రైతులకు తిరిగి ఇవ్వలేదన్నారు. ఫోర్త్ సిటీ కోసం 30 వేల ఎకరాలను సేకరించారని, ఇది పెద్ద కుంభకోణమని విమర్శించారు. ఫార్మాసిటీని లగచర్లకు తీసుకెళ్తే అక్కడి రైతులు, ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందన్నారు. వామపక్షాల పోరాటంతో ఫార్మాసిటీని ప్రభుత్వం రద్దు చేసిందని చెప్పారు. ఇండస్ట్రియల్ కారిడార్ పెడతామంటున్నదని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నదని, అది ఆగ్రహంగా మారే ప్రమాదముందని చెప్పారు. ఈనెల 25 నుంచి సంగారెడ్డిలో జరిగే రాష్ట్ర మహాసభల్లో రాజకీయ విధానాన్ని ప్రకటిస్తామన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అన్ని శక్తులనూ కలుపుకుని పోతామని అన్నారు. నవతెలంగాణ సిజిఎం పి ప్రభాకర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, టి జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు నంద్యాల నర్సింహారెడ్డి, బండారు రవికుమార్, కె ఆనందాచారి తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ డైవర్షన్ పాలిటిక్స్

- ప్రజల్ని మోసగించడంలో కాంగ్రెస్‌కు గురువు కెసిఆరే
- కేంద్ర మంత్రి బండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇంకెన్నాళ్లు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. ప్రజల్ని మోసగించడంలో కాంగ్రెస్‌కు గురువు కేసీఆరే అని విమర్శించారు. కెసిఆర్.. మన్మోహన్ సింగ్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేసినవ్ కదా ఆయన చనిపోతే కూడా వెళ్లకపోతివి.. అసెంబ్లీలో సంతాప తీర్మానం పెడుతున్నం.. రమ్మని పిలిచినా వెళ్లకపోతివి.. ప్రజా సమస్యలపై ఒక్కసారైనా మాట్లాడకపోతివి.. నీకు ప్రతిపక్ష నేత పదవి ఎందుకు' అని ప్రశ్నించారు. చేతనైతే ఆ పదవిని హరీశ్‌రావు, గంగుల, తలసాని, జగదీష్ రెడ్డిలలో ఎవరికో ఒకరికి ఇవ్వాలని సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఒక్కో రైతుకు ఏడాది బకాయితో కలిసి ఎకరాకు రూ.18 వేల బకాయి చెల్లిస్తారా?లేదా? 70 లక్షల మంది రైతులకు రూ.12, 600 కోట్లు జనవరి 26న చెల్లిస్తరా? లేదా? అని నిలదీశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లేయించుకుకోవడానికే అప్పుతెచ్చి మరీ రైతు భరోసా ఇవ్వబోతున్నదనీ, ఎన్నికలు అయిపోగానే నిలిపేస్తుందని విమర్శించారు. గ్రామపంచాయతీలకు నిధులను కేంద్రం ఇవ్వట్లేదని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని కొట్టిపడేశారు. దానిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. చేతగాని సర్కారు వల్ల ప్రయివేటు ఆస్పత్రుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని, రెయిన్‌బో ఆస్పత్రి ఆగడాలు శృతిమించిపోయాయని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు, పేదలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ దేశమైనా రవాణా రంగం బాగుంటేనే వేగంగా అభివృద్ధి చెందుతుందనీ, అందుకే ప్రధాని మోడీ ఆ రంగంపై ఎక్కువ దృష్టి సారించారని చెప్పారు. సోమవారం నుంచి చర్లపల్లి నుంచి రెగ్యులర్‌గా 24 రైళ్ల రాకపోకలు సాగించబోతున్నాయన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఏమయ్యాయని రేవంత్‌రెడ్డి సర్కార్‌ను ప్రశ్నించారు. ప్రతిపనికీ, బిల్లుకీ 14 శాతం కమీషన్లు దొబ్బుకుతినడం, హైకమాండ్‌కు కప్పం కట్టడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదని విమర్శించారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

ప్రజా కోణంలో వార్తలు రాసే పత్రిక 'నవ తెలంగాణ'

- నవతెలంగాణ కేలండర్ ఆవిష్కరణలో ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

ప్రజా కోణంలో.. అణగారిన వర్గాల సమస్యలను తెలియచేసే పత్రిక 'నవ తెలంగాణ' అని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండల కేంద్రంలోని ఐఎన్‌టియుసి, శ్రీపాద భవన్‌లో ఆదివారం నవతెలంగాణ దినపత్రిక 2025 కేలండర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా నిజాయితీగా పనిచేసే పత్రిక నవతెలంగాణ అని అన్నారు. ప్రజాకోణంలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడూ ప్రభుత్వానికి తెలియజేస్తూ పేద, బడుగు బలహీన వర్గాల సమస్యలను పత్రికలో ప్రచురిస్తూ, నిరంతరం ప్రజల అభిమానాన్ని చురగొంటున్న పత్రిక అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐఎన్టీయూసీ నాయకులు తోట చంద్రయ్య, ఆరెల్లి కొమురయ్య గౌడ్, చొప్పరి సదానందం బర్ల శ్రీనివాస్, కోట రవీందర్ రెడ్డి, తీగల సమ్మయ్య, ముస్త్యాల శ్రీనివాస్, మడ్డిరాజ్ కుమార్, కొలిపాక సారయ్య, చిందం మహేష్ పాల్గొన్నారు.

పిఆర్‌టియుటిఎస్ డైరీని ఆవిష్కరించిన సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (పిఆర్‌టియుటిఎస్) నూతన సంవత్సరం డైరీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, సిఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆవిష్కరించారని పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియుటిఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, వంగ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి మోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు పి వెంకట్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శులు బీరెల్లి కమలాకర్‌రావు, గుండు లక్ష్మణ్, బాధ్యులు శ్రీనివాస్‌రెడ్డి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

డైరీని ఆవిష్కరిస్తున్న సిఎం రేవంత్

తపస్ కేలండర్‌ను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి బండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నూతన సంవత్సరం కేలండర్‌ను కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, భారతీయ సంస్కృతిని కాపాడాలని కోరారు. రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తపస్ రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో భారతీయ విలువలను పెంపొందించే విధంగా పుస్తకాల రూపకల్పనలో తపస్ భాగస్వామ్యాన్ని పెంచాలని కోరారు. 317 జీవో పరిష్కారం కోసం, జీతాల కోసం, ఇతర సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారంలో తన వంతు ప్రయత్నం చేస్తామంటూ బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తపస్ ప్రతినిధి విష్ణువర్ధన్‌రెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య, భాస్కర్, నవీన్, శివబాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ

- భార్యాభర్తలు, కుమార్తె మృతి
- కుమారుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని ఒకే కుటుంబ సభ్యులు భార్యాభర్త, కుమార్తె మృతి చెందారు. కుమారుడికి తీవ్ర గాయాలు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. సిఐ అద్దాని సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ జిల్లాకు చెందిన భార్యాభర్తలు సాగి బుల్లబ్బాయి(37), లావణ్య(32), వారి కుమార్తె హర్షితా దేవి(8), కుమారుడు సిద్ధేశ్వర్ నగరంలోని ఉప్పల్ సౌత్ స్వరూప్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. బుల్లబ్బాయి ఉదయం తన ద్విచక్ర వాహనంపై టిఫిన్స్ అమ్ముతూ జీవనం కొనసాగిస్తున్నారు. అతని చిన్ననాటి స్నేహితుడు మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట గ్రామంలో నివాసం ఉంటున్నారు. ఇటీవల స్నేహితుడి భార్య చెయ్యి విరగడంతో వారిని పరామర్శించేందుకు ఉప్పల్ నుంచి ఎల్లంపేటకు ద్విచక్ర వాహనంపై భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలతో బయలుదేరారు. మేడ్చల్ చెక్‌పోస్ట్ పారిశ్రామికవాడ వద్దకు రాగానే ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి లారీ బలంగా ఢీకొట్టి వారిపై నుంచి వెళ్లింది. దాంతో బుల్లబ్బాయి, లావణ్య, హర్షిత దేవి ఘటన స్థలంలోనే మృతిచెందారు. కుమారుడు సాగి సిద్దేశ్వర్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు, సిఐ అద్దాని సత్యనారాయణ అంబులెన్స్‌లో మేడ్చల్ పట్టణంలోని సంప్రద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాలునికి చికిత్స కొనసాగుతోంది. మృతదేహాలను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ తెలిపారు.

సిఎంఆర్ కాలేజీ ఘటనలో ఇద్దరి అరెస్ట్

- ఏడుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల గర్ల్స్ హాస్టల్‌లోని బాత్ రూమ్ వీడియోల ఘటనను మేడ్చల్ పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఏడుగురిపై కేసు నమోదు చేశారు. విద్యార్థినుల హాస్టల్ గదిలోని బాత్రూంలో స్నానాలు చేస్తుండగా కెమెరాలతో రికార్డు చేసేందుకు, చూసేందుకు ప్రయత్నించామని నిందితులు నందకిషోర్(ఏ1), గోవింద్‌కుమార్ (ఏ2) విచారణలో ఒప్పుకోవడంతో వారిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు మేడ్చల్ జోన్ డిసిపి ఎన్ కోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడుగురిపై పోక్సో చట్టంతోపాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. బీహార్‌కు చెందిన నందకిషోర్, గోవింద్ కుమార్, హాస్టల్ నిర్వాహకులు కేవీ ధనలక్ష్మి, అల్లం ప్రీతిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ వరాహభట్ల అనంతనారాయణ, కళాశాల డైరెక్టర్ మాదిరెడ్డి జంగారెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. కళాశాల చైర్మెన్ చామకూర గోపాల్‌రెడ్డిపై కూడా కేసు నమోదు చేశారు. నందకుమార్(20)ను ఏ1గా, గోవింద్ కుమార్(20) ఏ2గా చేర్చినట్టు డిసిపి తెలిపారు. వార్డెన్లు కెవి.ధనలక్ష్మి, అల్లం ప్రీతిరెడ్డికి విషయం తెలిసినప్పటికీ నిర్లక్ష్యం వహించినందుకు వారిపైనా కేసు నమోదు చేసినట్టు చెప్పారు. సంఘటన వివరాలను బహిర్గతం చేయొద్దంటూ వార్డెన్లపై ఒత్తిడి తెచ్చిన ప్రిన్సిపాల్ వరాహభట్ల అనంతనారాయణ, డైరెక్టర్ మాదిరెడ్డి జంగారెడ్డి, కళాశాల చైర్మన్ చామకూర గోపాల్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

కేశపట్నంలో కార్డెన్ సెర్చ్

- రూ.2 లక్షల కలప చెక్కలు, దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని కేశపట్నం గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఆదివారం తెల్లవారుజామున ఫారెస్ట్ అధికారులు గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇండ్ల పరిసర ప్రాంతాల్లో ఉన్న టేకు కలప చెక్కలు, దుంగలను స్వాధీనం చేసుకున్న సమయంలో అటవీశాఖ అధికారులపై, వాహనాలపై స్థానికులు రాళ్లతో దాడి చేశారు. దాంతో అటవీశాఖ అధికారికి స్వల్పగాయలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న సిఐ భీమేష్, ఎస్ఐ తిరుపతి పోలీసు బలగాలతో గ్రామానికి చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు. పక్కా సమాచారం మేరకు కలప చెక్కలు, దుంగలు స్వాధీనం చేసుకొని, ఇచ్చోడ మండల కేంద్రంలోని ఫారెస్ట్ కార్యాలయానికి తరలించారు. ఈ కలప విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని కేటీఆర్ ఎఫ్‌డీఓ రేవంత్‌చంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓ పాండురంగ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, అటవీ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

వ్యాపారంగా మారిన జర్నలిజం

- పత్రికా స్వేచ్ఛ అంటే.. జర్నలిస్టుల స్వేచ్ఛ మాత్రమే
- మానికొండ చలపతిరావు నేటి తరం జర్నలిస్టులకు ఆదర్శం
- ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్ వినయకుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"నేటి ఆధునిక సమాజంలో జర్నలిజం వ్యాపార వస్తువుగా మారింది. యాజమాన్యాలు ప్రభుత్వాలకు తొత్తులుగా మారాయి. పత్రికా స్వేచ్ఛ అంటే... యజమానుల స్వేచ్ఛ కాదు... జర్నలిస్టుల స్వేచ్ఛ మాత్రమే. ప్రతీ వార్తను లాభ నష్టాల కోణంలోనే చూస్తున్నారు. ఈ విధానం సమాజానికి శ్రేయష్కరం కాదు. ఇలాంటి సంక్లిష్ట సమయంలో జర్నలిస్టు పితామహులు మానికొండ చలపతిరావును నేటి తరం పాత్రికేయులు ఆదర్శంగా తీసుకుని వృత్తిలో రాణించాలి" అని ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్ వినయకుమార్ ఆకాంక్షించారు. 'భారతీయ జర్నలిజం ధృవతార" పేరుతో మానికొండ చలపతిరావు గురించి సీనియర్ జర్నలిస్టు ఆకుల అమరయ్య రాసిన పుస్తక పరిచయ కార్యక్రమం ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా వినయకుమార్ హాజరై ప్రసంగించారు. స్వాతంత్ర్యానికి పూర్వం జర్నలిజం ఎలాంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొందో ప్రస్తుతం అలాంటి పరిస్థితులే పునరావృతమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిజంలో మోనోపొలిజం వృత్తి విలువల్ని దిగజార్చుతున్నదని వ్యాఖ్యానించారు. భారతీయ పత్రికా రంగంలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లాంటి సంస్థలు ఆ దిశగా వేసిన అడుగులను మొదట్లో నెహ్రూ అడ్డుకున్నప్పటికీ, తర్వాత కాలంలో ఆపలేక పోయారని గుర్తు చేశారు. ప్రస్తుతం అదే తరహా విధానాన్ని అన్ని పత్రికలు, చానళ్లు అమలు చేస్తున్నాయని అన్నారు. ఇంటర్వ్యూలు మొదలుకొని, వార్తా కథనాల వరకు అంతా వ్యాపారంగా మారిందని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన వాట్సప్, ఫేస్‌బుక్ తదితర డిజిటల్ మీడియా ప్లాట్‌ఫాంలు ఇష్టారాజ్యంగా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయని అన్నారు. నెహ్రూ నుంచి మొదలుకొని ప్రణయ్‌రాయ్ వరకు ఎవరిని వదలకుండా తప్పుడు కథనాలు వ్యాపింపజేస్తున్నాయని వివరించారు. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రస్తుత సంక్షోభ తరుణంలో చలపతిరావు లాంటి గొప్ప జర్నలిస్టును నేటి తరానికి పరిచయం చేస్తూ తీసుకొచ్చిన పుస్తకాన్ని అందరూ చదవాలని సూచించారు. జర్నలిస్టులకు ప్రెస్‌కౌన్సిల్ ఏర్పాటు, వేజ్‌బోర్డు అమలు, వర్కింగ్ జర్నలిస్టు యాక్ట్ తదితర హక్కుల సాధనలో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులుగా చలపతిరావు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. నెహ్రూతో ఎంతో సన్నిహితంగా ఉన్నా విధానపరంగా అనేక విషయాల్లో విభేదించారని అన్నారు. చివరి వరకు జర్నలిస్టుగా కొనసాగిన ఆయన పద్మ విభూషణ్‌ను కూడా తిరస్కరించారని గుర్తు చేశారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ చలపతిరావును కొలవడానికి లేదా తూయడానికి ఎవరి వద్దా తూనిక రాళ్లు లేవని, ఆయన నెహ్రూను మించిన వారని కొనియాడారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎల్ వేణుగోపాల్ నాయుడు మాట్లాడుతూ తెలుగు వాడిగా ఆయన భారతీయ జర్నలిజంలో చెరగని ముద్ర వేశారని అన్నారు. అంది వచ్చిన ఎన్నో అవకాశాలను తృణపాయంగా త్యజించి చివరి వరకు నిరాడంబరంగా జీవించారని అన్నారు. పుస్తక రచయిత అమరయ్య మాట్లాడుతూ విపరీతంగా పుస్తకాలు చదివిన ప్రపంచ ప్రముఖులు ఇద్దరే ఇద్దరని, వారిలో బ్రిటన్ మాజీ ప్రధాని విన్ స్టన్ చర్చిల్ ఒకరు కాగా రెండో వ్యక్తి మన తెలుగువాడు, జర్నలిస్టు ఉద్యమ పితామహుడు మానికొండ చలపతిరావేనని వివరించారు. నేషనల్ ఎలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఎజె), హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సభకు ఎన్ఎజె సెక్రటరీ జనరల్ ఎన్ కొండయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, జి వల్లీశ్వర్, నందిరాజు రాధాకృష్ణ, వలేటి గోపిచంద్, తాడి ప్రకాశ్, ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పేలిన మావోయిస్టుల బాంబు...!

- యువకుడి ఎడమ కాలుకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టులు అమర్చిన బాంబు ప్రమాదవశాత్తు పేలి వ్యక్తికి గాయమైన సంఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండలం వీరభద్రవరం పరిధి కర్రెగుట్ట సమీపంలోని డోలీ–చెలిమల అటవీ ప్రాంతంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.... ఇప్పగూడెం గ్రామానికి చెందిన సమ్మయ్య, పెదబాబు, అంకన్న గూడెం గ్రామానికి చెందిన నవీన్ కర్రెగుట్టల సమీపంలోకి వంట చెరుకు కోసం వెళ్లారు. అదే క్రమంలో గుట్టపై మావోయిస్టులు అమర్చి ఉంచిన ప్రెషర్ బాంబుపై నవీన్ ఎడమ కాలు వేయడంతో బాంబు పేలింది. ఈ ఘటనలో నవీన్ ఎడమ కాలుకి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి ఇద్దరు వ్యక్తులు డోలి సాయంతో అటవీ నుంచి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నవీన్‌ను ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకుకెళ్ళారు.

రైతుకు దగా!

- గ్రామాల్లో కాంగ్రెస్ నేతల్ని నిలదీయండి
- నేడు మండల, జిల్లా స్థాయిల్లో ఆందోళనలు : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిట్టనిలువునా మోసం చేసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ అన్నారు. రైతు భరోసా పేరుతో సంవత్సరానికి రూ.15వేలు ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి, ఇప్పుడు సవాలక్ష షరతులతో దాన్ని రూ.12వేలకే పరిమితం చేశారని విమర్శించారు. దీనికి నిరసనగా సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల, నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అంటేనే అబద్ధాల చరిత్ర అని సిఎం రేవంత్‌రెడ్డి మరోసారి నిరూపించారనీ, రైతు భరోసా అబద్ధాలపై ఆపార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని నిలదీశారు. ఆదివారంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీపై కూడా ఇలాగే అబద్ధాలు చెప్పారనీ, జనవరి 26 నుంచి రైతుభరోసా అబద్ధానికి చట్టబద్ధత కల్పిస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ రైతాంగం కాంగ్రెస్ చేసిన ఈ ద్రోహాన్ని క్షమించదని హెచ్చరించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇచ్చిన మాట తప్పడమేనా అని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఉద్యోగుల పరిస్థితులు బాగుండేవంటూ సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణను కించపరిచారని ఆక్షేపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉద్యోగులకు పీఆర్సీ, డీఏ ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీనే అని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇంజన్‌గా ఉన్న హైదరాబాదులో హైడ్రా, మూసీ పేరుతో ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేయడంతో రియల్ ఎస్టేట్ పడిపోయిందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ. 1.38 లక్షల కోట్ల అప్పు చేశారనీ. తాము రూ.5,943 కోట్ల రెవిన్యూ మిగులుతో రాష్ట్రాన్ని అప్పగించామని వివరించారు. హార్టికల్చర్ రైతులకు రైతు భరోసాపై స్పష్టత ఇవ్వలేదనీ, ఉద్యోగులకు భూమితో సంబంధం లేకుండా చేస్తున్నారని ఆరోపించారు.

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హౌస్ అరెస్ట్

- దగాకోరు ప్రభుత్వం
- హామీల అమల్లో మోసం చేస్తోందని ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతు భరోసా తగ్గింపుపై నిరసన, నారాయణపూర్ రిజర్వాయర్‌ను ఎల్లంపల్లి నీటితో నింపాలన్న డిమాండ్‌తో ఆందోళనకు పిలుపునిచ్చిన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను ఆదివారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు, రైతులను దగా చేస్తోందని ఆయన అన్నారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామంలోని నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలు, రైతులను మోసం చేసినందుకు సిఎం రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏం చేసిందని సిఎం చిత్రపటానికి పాలాభిషేకాలు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రతి రైతుకూ రైతుబంధు కింద రూ.15వేలు ఇవ్వకుండా రూ.12 వేలు ఇస్తామనడం మోసం చేయడమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎన్నో మోసపూరితమైన హామీలు గుప్పించారని, ఇప్పుడు అమలు చేయక మోసం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో మళ్లీ ఎరువుల కొరత ఏర్పడిందన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి ఓట్లేసిన రైతులు, ప్రజలు తిరగబడి తరిమికొట్టే సమయం ఆసన్నమైందన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టిస్తూ అరెస్టు చేస్తున్నారని, ప్రజలు చూస్తూ ఉపేక్షించారనే విషయం గ్రహించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే సుంకెను బూరుగుపల్లిలో హౌస్ అరెస్ట్ చేయగా, గంగాధర మండలంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచులను అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

రవిశంకర్ ఇంటి వద్ద ఉన్న పోలీసులు